క్లుప్తంగా

‘ఎస్కీ’కి గోల్డెన్ పికాక్ అవార్డు



రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)కి ‘గోల్డెన్ పికాక్ అవార్డు’- 2023ను దక్కించుకుంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఇండియా ద్వారా ఈ అవార్డును దేశంలోని పలు సంస్థలకు ప్రతియేటా అందిస్తుంటారు. దుబాయిలోని హబ్తూర్ ప్యాలెస్‌లో అతిథుల చేతుల మీదుగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు గురువారం ఉదయం అందుకున్నారు. ఎస్కీ అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. గోల్డెన్ పికాక్ అవార్డును ఎస్కీ ఎనిమిదోసారి కైవసం చేసుకోవడం గమనార్హం.

ఒంటిపై టర్పెంటాయిల్ పోసుకుని నిప్పంటించుకుని..

మియాపూర్ : ఓ మహిళ టర్పెంటాయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని సాయినగర్ కాలనీకి చెందిన పర్వీనాబేగం అలియాస్ రిజ్వానాబేగం(43), మహ్మద్ జమీల్‌ను 2002 సంవత్సరంలో వివాహం చేసుకుంది. జమీల్ పెయింటింగ్, డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా జమీల్ కొన్ని సంవత్సరాల నుండి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి .గురువారం ఉదయం గొడవ జరగగా భర్త బయటికి వెళ్లిన తర్వాత టర్పెంటాయిల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు చూసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే పర్వీనాబేగం మృతిచెందింది. దీంతో మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు పర్వీనాబేగం సోదరుడు సయ్యద్ అబ్దుల్ నజీబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


భారత్ లక్ష్యం స్వదేశీ సాంకేతికత

● డీఆర్డీఓ శాస్త్రవేత్త రాజేశ్

పటాన్‌చెరు టౌన్: దేశీయంగా రూపొందించి, అభివృద్ధి చేసి, సొంత సాంకేతికతను సాధించే లక్ష్యంతో మన దేశం ముందుకు సాగుతోందని రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్డీఓ) శాస్త్రవేత్త రాజేశ్ ఎస్.కర్వాండే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం హవానా - 2.0 పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ అంతర్ కళాశాల సాంకేతికోత్సవానికి హాజరై మాట్లాడారు. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు ఉండి, వాటికి నిధులు అవసరమైతే విద్యార్థులు డీఆర్డీఓను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా జంట నగరాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపు 20 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు నరేశ్‌కుమార్, డాక్టర్ అనిత, ప్రవీణ్, జీఎలక్ట్రా అధ్యక్షుడు ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

వీడిన బాలుడి కిడ్నాప్ మిస్టరీ

● తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించిన పోలీసులు
● పోలీసుల అదుపులో కిడ్నాపర్ వాణి



మియాపూర్: బాలుడి కిడ్నాప్ మిస్టరీ వీడింది. మియాపూర్ పోలీసులు ఎట్టకేలకు బాలుడి ఆచూకీ కనిపెట్టి తీసుకువచ్చి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు..తాండూరుకు చెందిన దాసరి మల్లేష్ , గంగమ్మ దంపతులు మియాపూర్ లోని మంజీరా రోడ్డు సమీపంలో గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు సాయి ఉన్నాడు. గంగమ్మ చెత్త ఏరుకుని జీవనం సాగించేది. మంగళవారం చేత్త ఏరుకున్న అనంతరం ఉదయం 11 సమయంలో స్నేహితురాలు వాణితో కలిసి వైశాలి నగర్లోని చెట్టు కింద నిద్రించింది. గంగమ్మ నిద్రనుంచి లేచేసరికి ఆమె కుమారుడు సాయిని వాణి తీసుకుని వెళ్లి పోయింది.దీంతో ఆదే రోజు మధ్యాహ్నం మియాపూర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలు మెదక్ జిల్లా చిన్న శంకరం పేట్ లో ఉన్నట్లు ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి గురువారం సాయంత్రం వాణిని అదుపులోకి తీసుకున్నారు. సాయిని తీసుకుని వచ్చి తల్లి దండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ నర్సింహా రావు, సీఐ తిరుపతి రావు అభినందించారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్..బారులు తీరిన వాహనాలు



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక సిగ్నల్

అసలే ఇరుకు.. ఆపై అవస్థలెన్నో..

వేధిస్తున్న ట్రాఫిక్ జామ్

● రైల్వే బ్రిడ్జి వద్ద వాహనదారులకు తప్పని ఇబ్బందులు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే లింకు రోడ్లు, అండర్ పాస్‌లు అందుబాటులోకి వచ్చాయి. కానీ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్ నుంచి బొటానికల్ గార్డెన్, మసీద్ బండకు వెళ్లే లింకు రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రాగానే ఇరుకుగా మారింది. వైశాలినగర్ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు, దాని తర్వాత నుంచి మసీద్ బండ వరకు రోడ్డు పూర్తయినా, రైల్వే బ్రిడ్జి వద్ద మాత్రం ఇరుకుగా మారింది. ఇక అదే రోడ్డులో నాలా కాలువ ఉంది. మదీనాగూడ, చందానగర్, మియాపూర్ నుంచి గచ్చిబౌలికు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్‌తో పాటు సమయం ఆదా అవుతుందని ఈ మార్గంలో ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక చొరవతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు కొద్ది నెలల క్రితం తాత్కాలికంగా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. కానీ ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ సమస్య పెరిగింది. కాగా వైశాలీనగర్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు డివైడర్ ఏర్పాటుతో బాటు నాలాను మరో వైపునకు మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్ లింకు రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇరుకు రోడ్డులో ఒకవైపు వెళ్తున్న వాహనాలు



రైల్వే అండర్ బ్రిడ్జి వరకు డివైడర్ లేకపోవడంతో ఇష్టానుసారంగా వస్తున్న వాహనాలు

సమస్యలు ఇవే..

◆ రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్డులో మురుగు కాలువ ఉండడంతో ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
◆ బ్రిడ్జి కింద రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు నీటి కాలువ నిర్మించడంతో కేవలం ఒక వాహనం మాత్రమే వెళ్లగలదు.
◆ ఇక్కడ తాత్కాలిక సిగ్నల్ వల్ల ఉదయం, సాయంత్రం వేళ భారీగా ట్రాఫిక్ జాంలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
◆ సిగ్నల్ సమయం తక్కువగా ఉండడం వల్ల కార్లు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.
◆ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకొని రైల్వే అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి



వైశాలీనగర్ లింక్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక సిగ్నల్ వల్ల ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్ వద్ద ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి. అండర్ బ్రిడ్జి నుంచి ఇరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా రాకుండా డివైడర్‌ను ఏర్పాటు చేయాలి.

– అనంత్, వాహనదారుడు

రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వగానే పనులు చేపడతాం..



వైశాలీనగర్ నుంచి మసీద్‌బండ వరకు లింక్ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. రైల్వే అండర్ బ్రిడ్జి కింద మాత్రం ఇరుకుగా ఉంది. దానికి అనుగుణంగా తాత్కాలిక ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశాం. కానీ ట్రాఫిక్ సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. రైల్వే బ్రిడ్జి కింద మరో రోడ్డు వేయడం కోసం రైల్వే అధికారుల అనుమతులు కోసం వేచి చూస్తున్నాం. అనుమతులు ఇవ్వగానే రోడ్డు విస్తరణ పనులు చేపడుతాం.

–ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



అవంతిక గోదావరి హోమ్స్‌కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని అవంతిక గోదావరి హోమ్స్‌కాలనీలో ఎమ్మెల్యే గాంధీ గురువారం పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందించారు. కొత్తగా ఏర్పడిన కాలనీకి మంజీరా నీటి వసతి కల్పించాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, కాలనీవాసులు కిరణ్‌కుమార్, శ్రీహర్ష, సాయికృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

నాకు న్యాయం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తనతో ప్రేమలో ఉన్న యువకుడు మరో అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమయ్యాడని, దానిని నిలిపివేసి న్యాయం చేయాలంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... రామచంద్రాపురం పట్టణంలో నివాసముండే వినూత్నేశ్వరి ఈర్ల ప్రశాంత్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఎంతో ఆప్యాయంగా ఉండే ప్రశాంత్ నెలరోజుల నుంచి కనిపించడం లేదు. శుక్రవారం మరో అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమైనట్టు తెలిసింది. విషయం తెలియగానే మనోవేదనకు లోనై గురువారం వినూత్నేశ్వరి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. ప్రేమపేరుతో తనను మోసం చేసిన ప్రశాంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి

టీపీసీసీ ప్రతినిధి సత్యనారాయణరావు



తారానగర్‌లో జోడోయాత్రలో టీపీసీసీ ప్రతినిధి సత్యనారాయణరావు తదితరులు

శేరిలింగంపల్లి: తెలంగాణ ఏర్పాటయ్యాక ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని టీపీసీసీ ప్రతినిధి సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్ తుల్జాభవానీ ఆలయం నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం రాత్రి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రానికి సీఎం కేసీఆర్ చేసింది ఏమీ లేదని, కేవలం వారి కుటుంబాలే బాగుపడ్డాయని విమర్శించారు. నీళ్లు, నిధులు ,నియామకాలని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రజలను మోసం చేసారన్నారు. జోడో యాత్రలో భాగస్వాములై కాంగ్రెస్ పార్టీకి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌశల్ సమీర్, ఎండీ ఎలియాస్ షరీఫ్, నర్సింహగౌడ్, ఈశ్వర్, ముత్యంరెడ్డి, గఫూర్, రాగం శ్రీనివాస్‌యాదవ్, జమీర్, అక్బర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



గచ్చిబౌలి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జీవితం యువతకు ఆదర్శమని టీయూడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ అన్నారు. గురువారం గచ్చిబౌలి అంజయ్యనగర్ సగర సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా ఉంటూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి అంచెలంచెలుగా ఎదిగిన శ్రీనివాస్‌గౌడ్‌ను చూసి గర్విస్తున్నామని అన్నారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు శ్రీనివాస్ గౌడ్ పెద్ద దిక్కు అని అన్నారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో గ్రేటర్ సగర సంఘం అధ్యక్షులు ఎం.రవిసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నయ్య సాగర్, గ్రేటర్ యుజన సంఘం అధ్యక్షులు ఎర్రం శెట్టి సీతారాం సాగర్, ప్రధాన కార్యదర్శి గొని సాయి కుమార్, నర్సింహ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటుకు గురువారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, డిప్యూటీ కమిషనర్ బాలయ్య, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్యలు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం పక్కన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నూతన వార్డు కార్యాలయ నిర్మాణానికి రూ. కోటి 40లక్షలు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి స్వామి నాయక్, ఏఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న జోనల్ కమిషనర్ శంకరయ్య, డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్

సామాజిక మార్పునకు డాక్యుమెంటరీలు దోహదం



అతిథులను సత్కరిస్తున్న వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: సమస్యలపై అవగాహన పెంచడం ..సామాజిక మార్పును ప్రోత్సహించడానికి డాక్యుమెంటరీ చిత్రాలు దోహదం చేస్తాయని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మూడురోజుల డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్స్‌పై ‘మనూ’ ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ), ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్(ఐడీపీఏ) ముంబయి సంయుక్తంగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. గురువారం వర్క్‌షాప్‌ను ప్రారంభించి వీసీ మాట్లాడారు. డాక్యుమెంటరీ చిత్రాల ప్రాముఖ్యత ఎంతో ఉందని, డాక్యుమెంటరీ మేకింగ్ గురించి ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు.ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ఐడీపీఏ అధ్యక్షుడు సంస్కర్‌దేశాయ్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, నిర్మాతలు మహ్మద్ ముజాహిద్ అలీ, ఒమర్ ఆజ్మీ తదితరులు ప్రసంగించారు.

జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలి

● ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి

హఫీజ్‌పేట్ : నేడు యువతులు తమ జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్, లైఫ్ కోచ్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ ఆవరణలో ఇంద్రజిత్ గుప్తా మెమోరియల్ హాల్‌లో మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయిని సీఆర్ ఫౌండేషన్ హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళ సంక్షేమ కేంద్ర డైరెక్టర్ డి.కృష్ణకుమారి, సభ్యులు జోస్న భట్ల, కోశాధికారి చెన్నకేశవరావు, సంఘం మహిళలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా..

ఆల్విన్‌కాలనీ: అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.21 లక్షల 71 వేలను గురువారం గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్‌యస్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, ఊట్ల చంద్రారెడ్డి, చంద్రమోహన్ సాగర్, విద్యా సాగర్, అష్రాఫ్, శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న శిల్పా బృందావనం భక్తులు

భాగ్యనగర్‌కాలనీ: షంషీగూడలోని శిల్పా బృందావనం శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 4.30కు సుప్రభాతం, నవగ్రహ పూజ, నవగ్రహ దానం , అభిషేకం, ఆరాధన నిర్వహించారు. సాయంత్రం 5.30కు స్వామివారి ఎదుర్కోలు, కల్యాణ మహోత్సవం, తిరుచ్చి ఉత్సవం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మైటోకాండ్రియల్ డీఎన్ఏ వారసత్వంగా సంక్రమిస్తుంది

ప్రొఫెసర్ డగ్లస్ సి వాలెస్



ప్రొ.డగ్లస్‌ను సన్మానిస్తున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ నరేష్‌బాబు

రాయదుర్గం: మైటోకాండ్రియల్ డీఎన్ఏ ప్రత్యేకంగా ప్రసూతి వారసత్వంగా సంక్రమిస్తుందని అమెరికాలోని ఫిలడెల్ఫియా చిల్డ్రన్స్ ఆస్పత్రిలోని సెంటర్ ఫర్ మైటోకాండ్రియల్, ఎపిజెనెటిక్ మెడిసిన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డగ్లస్ సి వాలెస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోకెమిస్ట్రీ విభాగాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైటోకాండ్రియల్ డీఎన్ఏలోని జన్యుపరమైన మార్పులు, జీవక్రియ, క్షీణత, క్యాన్సర్, వృద్ధాప్యం వంటి వ్యాధులకు దారితీస్తాయన్నారు. డీఎన్ఏ మానవ వ్యాధులకు పరమాణు మార్కర్‌గా ఎలా ఉపయోగించబడుతుందో వివరించారు. అంతకుముందు హెచ్‌సీయూలోని బయోకెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ నరేష్‌బాబు బృందంతో సమావేశమై చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఆయనను హెచ్‌సీయూ అధికారులు ఘనంగా సత్కరించారు.

డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రాక్టీస్, ట్రెండ్స్‌పై సింపోజియం



హెచ్‌సీయూలో సింపోజియంలో పాల్గొన్న హెచ్‌సీయూ, వివిధ దేశాల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సౌత్ ఏషియన్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రాక్టీస్, ట్రెండ్స్‌పై సింపోజియం ముగిసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్‌కు చెందిన బనిసింగ్ రచించిన ‘తాంగ్/లాగింగ్’, పాకిస్తాన్‌కు చెందిన అనమ్ అబ్బాస్ రచించిన ‘దిస్ స్టెయిన్డ్ డాన్’లతో పాటు మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్‌కు చెందిన సినిమాలు కూడా ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. దక్షిణాసియా దేశాల్లో డాక్యుమెంటరీ ప్రాక్టీషనర్లు అనుసరించిన పంథాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అంజలి మాంటెరో, జయశంకర్, సుమతీ శివమోహన్ (శ్రీలంక), హెచ్‌సీయూ ప్రొఫెసర్ వినోద్ పవరాల, ఉషారామన్, సత్యప్రకాశ్, అంజలీలాల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు

రాయదుర్గం: బీజేపీ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు.గచ్చిబౌలి డివిజన్ పరిధి గౌలిదొడ్డిలోని కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం బీజేపీ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 31 మందితో బూత్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. బీజేపీపై విశ్వాసం పెరిగేలా చూడాల్సిన బాధ్యత బూత్ కార్యకర్తలదే అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ ముదిరాజ్, హన్మంతు నాయక్, నరేందర్ ముదిరాజ్, రమేష్, విఠల్, నర్సింహ్మారావు, కిషన్, శివసింగ్, వెంకటేష్, తిరుపతి, పలువురు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి సహకారం



దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బీసీ కాలనీలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని నిర్మించేందుకు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, గోపాలమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462